సాక్షి
ఖమ్మం
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



ఎంపీ నామా ఆర్థికసాయం

చీమలపాడు ఘటనలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రకటించిన ఆర్థికసాయాన్ని అందజేశారు. 8లో



బీజేపీని ఓడించడమే లక్ష్యం

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యమని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు హేమంతరావు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
43° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.



ఇఫ్తార్
(గురువారం సా॥)
6.31

సహర్
(శుక్రవారం ఉ॥)
4.26

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మంత్రి పువ్వాడకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం



మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి బుధవారం పుట్టిన రోజు జరుపుకోగా.. ప్రజలకు నిండు నూరేళ్ల సేవలందించాలని భగవంతుడిని కోరుకుంటున్నానని సీఎం లేఖలో వెల్లడించారు. కాగా, ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మంత్రి తన పుట్టిన రోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నివాసంలో మొక్క నాటారు. ప్రతీ పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

22నుంచి విద్యాసంస్థల్లో సమ్మర్‌క్యాంపులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యాన విద్యాసంస్థల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటుచేయనున్నారు. ఈనెల 22నుంచి మే 6వ తేదీ వరకు జరిగేల ఈ క్యాంపులకు సంబంధించి పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూధన్ కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాంపుల్లో శాస్త్రీయ నృత్యం, థియేటర్ ఆర్ట్, బ్యూటీ కేర్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, సాంఘిక సంక్షేమ శాఖ ఆర్‌సీఓ ప్రత్యూష, కూసుమంచి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు, క్యాంపు కోఆర్డినేటర్ పీ.వీ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అగ్రి క్లినిక్ ఏర్పాటుకు స్థలపరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటుచేయనుండగా, కామేపల్లి మండలం ముచ్చర్లలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావేద్ పాషా బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో రైతువేదికలో సమావేశమైన ఆయన అగ్రి లీగల్ క్లినిక్ ఉపయోగాలను వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ తారాదేవి, ఏఈఓ ఉష తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్



ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన జిల్లాకు రానున్నారు. కాంగ్రెస్ అధ్వర్యాన ఖమ్మంలో 24 న నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న రేవంత్‌రెడ్డికి కాల్వొడ్డులో స్వాగతం పలకనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. అక్కడి నుంచి గాంధీ చౌక్ మీదుగా ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు సుమారు ఐదు కి.మీ. మేర జరిగే ర్యాలీలో పాల్గొన్నాక రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని వివరించారు.

పంటకు పరిహారం



కొణిజర్ల మండలం కొండవనమాలలో నేలకొరిగిన మొక్కజొన్న (ఫైల్)

- గత నెలలో అకాల వర్షాలతో నష్టం
- ఉమ్మడి జిల్లా రైతులకు రూ.25.06కోట్లు మంజూరు
- 90 రోజుల్లో ఖాతాల్లో జమ కానున్న నగదు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్రప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతనెల 17 నుంచి 21వ తేదీ వరకు ఈదురుగాలులు, వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో 18,258 మంది రైతులకు చెందిన 23,632.17 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,978 మంది రైతులకు చెందిన 1,435 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. ఈమేరకు రూ.25.06 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది.

33శాతం దెబ్బతింటేనే..

వర్షాలతో పంట నష్టం జరగగా అధికారులు సర్వే చేశారు. పంట నష్టంపై నివేదికలు రూపొందిస్తుండగా సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించి పరిహారం ప్రకటించారు. దీంతో ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతం పంట నష్టపోయిన వారిని గుర్తించి వ్యవసాయ శాఖ సమగ్ర సర్వే చేసిన నివేదించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పరిహారం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 1,30,988 మంది రైతులు సాగు చేసిన పంటలు 1,51,645.20 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఇందుకోసం రూ.151,64,55,000 పరిహారాన్ని విడుదల చేసింది. ఇందులో ఖమ్మం జిల్లాలో 23,632.17ఎకరాల్లో పంట నష్టపోయిన 18,258మంది రైతులకు రూ.23,63,24,250 పరిహారం మంజూరు చేశారు. ఇక భద్రాద్రి జిల్లాలో 1,978 మంది రైతులకు చెందిన 1,435 ఎకరాల్లో పంటలకు రూ.1.43,52,500 పరిహారం విడుదలైంది. ఈ పరిహారాన్ని 90 రోజుల వ్యవధిలో బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రధానంగా మొక్కజొన్న..

గతనెల 17 నుంచి 21వ తేదీ వరకు వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిశాయి. దీంతో యాసంగిలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రధానంగా మొక్కజొన్న పంట దెబ్బతినగా, అక్కడక్కడ పెసర, ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లింది. దీంతో గతనెల 23వ తేదీన ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు.

ధనబలానికి స్థానం లేదు..



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, వేదికపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

- ప్రజాస్వామ్యంలో డబ్బు, అహంకారం పనికిరావు
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి
- హాజరైన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే సండ్ర

కల్లూరురూరల్: ప్రజాస్వామ్యంలో పార్టీలు, అభ్యర్థులకు ప్రజల ఆశీస్సులు ఉండాలని, ప్రజాబలంతోనే రాజ్యాధికారం వస్తుందే తప్ప డబ్బు, అహకారంతో కాదని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కల్లూరు మండలంలో చెన్నూరులో బుధవారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇదే ప్రాంతానికి చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐదేళ్లు ఎంపీగా ఉన్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. కానీ ఇప్పుడు ఆయన జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి ఏ ఎమ్మెల్యేనూ అసెంబ్లీ గేటు తాకనివ్వనని చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు ఉన్నందున ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రులు ఎన్‌టీఆర్, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన అనేక మంచి పనులను ప్రస్తుత సీఎం కేసీఆర్ ఇంకా సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

పది సీట్లు గెలుస్తాం...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చే ఎన్నికల్లో పది సీట్లు బీఆర్‌ఎస్ గెలవడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేట్ తాకకుండా అడ్డుకుంటామని చెబుతున్న వారిని తొక్కుకుంటూ వెళ్తామని స్పష్టం చేశారు. దేశంలో 46 ఉత్తమ గ్రామపంచాయతీలకు అవార్డులు వస్తే తెలంగాణ జీపీలే 13 ఉండడంతోనే ఇక్కడ గ్రామీణాభివృద్ధి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరి దయాదాక్షిణ్యాలతో తాను రాజకీయ జీవితం ప్రారంభించలేదని, ప్రజాబలం ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరన్నారు. అసెంబ్లీ గేటు తాకనివ్వనని అనడం పొంగులేటి అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మండల వాసి కాకున్నా ఎంపీ బండి పార్థసారధిరెడ్డి కల్లూరులో బస్టాండ్ నిర్మాణానికి రూ.కోటి నిధులు ప్రకటించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులను విమర్శించే నైతిక హక్కు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి లేదని స్పష్టం చేశారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకం అందించిన బీఆర్‌ఎస్ అభ్యర్థులను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈసమావేశంలో డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు రాయల శేషగిరిరావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావుతో పాటు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, ఎండీ.ఇస్మాయిల్, బోబోలు లక్ష్మణరావు, కొరకొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సొరంగమే ఫైనల్!

- సీతారామ ప్యాకేజీ–16 పనుల్లో కీలకమార్పు
- కాల్వలకు బదులు సొరంగానికి అనుమతిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- తద్వారా రూ.275 కోట్ల మేర తగ్గనున్న ప్రతిపాదిత వ్యయం



టన్నెల్ ప్రతిపాదిత స్థలానికి ఇరుపక్కలా జరుగుతున్న కాల్వ నిర్మాణ పనులు



సాయిల్ టెస్ట్ చేయిస్తున్న సీఈ శంకర్‌నాయక్, అధికారులు (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి జిల్లా రైతులకు వరప్రదాయినిలా నిలవనున్న సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ప్యాకేజీ–16లో తొలుత ప్రతిపాదించినట్లుగా కాల్వకు బదులు సొరంగం(అండర్ టన్నెల్) నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిస్తూ బుధవారం జీఓ జారీ చేసింది. ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పనులకు సంబంధించి తిరుమలాయపాలెం మండలంలో డీప్ కట్‌తో కాల్వ తవ్వాలని తొలుత ప్రతిపాదించారు. అయితే, దీనికి ఎక్కువ సమయం పట్టడంతో పాటు వందలాది ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. అంతేకాక వ్యయం కూడా పెరుగుతుందని నిర్ధారణకు వచ్చిన జలవనరుల శాఖ అధికారులు ఎనిమిది కిలోమీటర్ల దయా (చుట్టు కొలత)తో అండర్ టన్నెల్ నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ అంశంపై రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ గతంలోనే ఆమోదముద్ర వేయగా ప్రభుత్వం కూడా ఆమోదిస్తూ జీఓ జారీ సింది. ఇప్పటికే అండర్ టన్నెల్‌కు రెండు వైపులా చేపట్టాల్సిన ఇతర పనులు కొన్ని నెలలుగా చేపడుతున్నారు.

సుమారు రూ.300 కోట్లు ఆదా..

డీప్ కట్ కాల్వ నిర్మాణానికి 864 ఎకరాల భూమి అవసరం కాగా, టన్నెల్ నిర్మాణానికి 300 ఎకరాలు సేకరిస్తే సరిపోతుంది. దీంతో మిగతా 564 ఎకరాల భూమికి సంబంధించి పరిహారం రూ.104 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదా కానుంది. అలాగే కాల్వ నిర్మాణానికి రూ.622 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొనగా.. ఇప్పుడు సొరంగాన్ని రూ.453 కోట్లతోనే పూర్తి చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా రూ.275 కోట్ల వరకు ప్రతిపాదిత వ్యయం తగ్గుతుందనే నిర్ధారణకు వచ్చారు. జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు, పాతర్లపాడు, బీరోలు, కూసుమంచి మండలం పోచారం, కూసుమంచి గ్రామాల రెవెన్యూ పరిధిలో 16వ ప్యాకేజీ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

పర్యావరణానికి కూడా ముప్పు

తొలి అంచనాల మేరకు సీతారామ ప్రాజెక్టు 16వ ప్యాకేజీలో 35 మీటర్ల మేర డీప్ కట్(లోతు)లో కాల్వ తవ్వాల్సి ఉంది. తద్వారా పాలేరు జలాశయానికి నీరు సులభంగా ప్రవహిస్తుందని భావించారు. కానీ ఇందుకోసం భూసేకరణ, నిర్మాణ వ్యయం పెరుగుతుండడం.. పనులు తిరుమలాయపాలెం మండలంలోని ఐదారు గ్రామాల మధ్య నుంచి చేపట్టాల్సి రావడంతో భూసేకరణలో జాప్యం జరుగుతుందని గుర్తించారు. అలాగే, కాల్వ తవ్వకానికి బ్లాస్టింగ్, ఇతర పనులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, నిర్మాణానికి నాలుగేళ్లు పట్టే అవకాశముందనే నిర్ధారణకు వచ్చిన అధికారులు సొరంగ మార్గం వైపు మొగ్గు చూపారు.

ప్రతిపాదనలు ఇలా..

పాత కాల్వ ఆధునికీకరణ విధుల్లో కీలకంగా వ్యవహరించడమే కాక కాళేశ్వరం ప్రాజెక్టు డీఈగా పనిచేసి ప్రస్తుతం తిరుమలాయపాలెం డీఈగా ఉన్న రమేష్‌రెడ్డి 16వ ప్యాకేజీలో డీప్ కట్ కాల్వకు బదులు అండర్ టన్నెల్ నిర్మిస్తే మంచిదని తొలుత ప్రతిపాదించారు. తన ఆలోచనను జలవనరుల శాఖ సీఈ, ఎస్ఈ ఇతర ఇంజనీర్లతో పంచుకున్న ఆయన కాల్వకు బదులు సొరంగ మార్గం నిర్మాణానికి డిజైన్ రూపొందించారు. తక్కువ వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని ప్రభుత్వానికి నివేదించగా ఆమోదం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, పాత డిజైన్ ప్రకారం కాల్వ నిడివి 14.22 కి.మీ. దూరం ఉండగా.. కొత్త డిజైన్ ద్వారా 12.79 కి.మీ.లోనే పూర్తవుతుంది. ఇందులో ఎనిమిది కి.మీ. మేర అండర్ టన్నెల్ ఉండగా, మిగతా కాల్వ రెండు పక్కలా నిర్మించనున్నారు.

ఎప్పటికప్పుడు సీఎంఆర్ సేకరణ

- ధాన్యం తరలింపునకు ఇబ్బంది రాకుండా చర్యలు
- ఎఫ్‌సీఐ గోదాంలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



ఎఫ్‌సీఐ గోదాంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్న నేపథ్యాన.. మిల్లుల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను ఏ రోజుకారోజు స్వీకరిస్తే ధాన్యం తరలింపునకు ఇబ్బంది ఉండదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈమేరకు మిల్లర్లు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలను బుధవారం పరిశీలించిన కలెక్టర్, సీఎంఆర్ బియ్యం సేకరణ, అన్ లోడింగ్‌పై ఆరా తీశారు. జిల్లాలో 64 రైస్ మిల్లులు ఉండగా, రోజుకు రెండు వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ సేకరించాల్సి ఉందన్నారు. కానీ 1,200 మెట్రిక్ టన్నులే తీసుకుంటున్నందున మిల్లుల్లో బియ్యం పేరుకుపోయి ధాన్యం సేకరణకు సమస్య వస్తోందని చెప్పారు. ఈమేరకు రఘునాథపాలెంలో 25వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్లను లీజుకు తీసుకుని సమస్య పరిష్కరించాలని సూచించారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేలా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన గోద్రెజ్ కంపెనీ బాధ్యులతో సమావేశమై పామాయిల్ ఫ్యాక్టరీ స్థల కేటాయింపుపై సమీక్షించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

నగరంలోని జెడ్పీ ప్రాంగణంలో ఈవీఎంలు భద్రపర్చిన గోడౌన్‌ను కలెక్టర్ గౌతమ్ బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల ఈసీఐఎల్ నుండి వచ్చిన 2197 ఈవీఎంల్లో ఒకటి పనిచేయకపోవడంతో తిరిగి పంపించేందుకు గోడౌన్ తెరిచినట్లు చెప్పారు.

బీసీ భవన్ నిర్మాణం పూర్తిచేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. బీసీ భవన్ నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన ఆయన పలు సూచనలు చేశాక, బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. అలాగే, వారికి స్టడీ మెటీరియల్ అందజేశారు.



బీసీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్

వైద్య కళాశాల పనుల్లో వేగం

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి భవనాల మరమ్మతు, నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన వంద సీట్లతో కళాశాలకు అనుమతి వచ్చినందున పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. కాగా, బ్యాంకు, పోస్టాఫీస్, ఎన్జీవోస్ కార్యాలయాలు ఇంకా ఖాళీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ రంగ ప్రసాద్ నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, పౌరసరఫరాల సంస్థ డీఎం సోములు, ఏఎంటీ నర్సింహారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఆర్డీఓ రవీంద్రనాథ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు శ్రీనివాసులు, సైదులు, రంజిత్, రాంబాబు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర మాసం.. రంజాన్

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- వివరాలు.. 8లో



ముస్లింలకు ఖర్జూరా తినిపిస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జగ్జీవన్‌కుమార్

- ప్రస్తుత జడ్జి శ్రీనివాసరావు గోదావరిఖనికి బదిలీ
- మరో ఇద్దరికి కూడా స్థానచలనం



బీ.ఎస్.జగ్జీవన్ కుమార్

ఖమ్మంలీగల్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రధాన న్యాయమూర్తులతో పాటు పలువురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావును గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు కమ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. శ్రీనివాసరావు స్థానంలో నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ ఇక్కడకు రానున్నారు. కాగా, శ్రీనివాసరావు జిల్లా జడ్జిగా ఏడాది కాలం పనిచేయగా, సాంఘిక దురాచారాలపై అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. భ్రూణహత్యలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు కృషి చేశారు. లోక్ అదాలత్ ద్వారా పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. ఇక ఖమ్మం ఒకటో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఆర్.డానీరూత్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న కె.ఉమాదేవి నియమితులయ్యారు. అంతేకాకుండా సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పి.శివరాంప్రసాద్ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జిగా బదిలీ అయ్యారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి పసుపులేటి చంద్రశేఖర్‌ప్రసాద్ మహబూబాబాద్ జిల్లా జడ్జిగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లా జడ్జి పి.వసంత్ నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

సాధారణ కాన్పునకు 'కసరత్తు'!



సత్తుపల్లి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈనేపథ్యాన శిక్షణ పొందిన సిబ్బందితో గర్భిణులు, వారి కుటుంబీకులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్లేటి విజయలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆస్పత్రిలోని సీమాంక్ సెంటర్‌లో గర్భిణులు సాధారణ ప్రసవం కోసం చేయాల్సిన వ్యాయామం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది మమత, పర్వీన్, మణిమ్మ శిక్షణ ఇచ్చారు. – సత్తుపల్లి టౌన్

క్లుప్తంగా

నాయకన్‌గూడెం వాసికి డాక్టరేట్



పరమేష్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిన్నెర పరమేష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ లభించింది. చరిత్ర విభాగం ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు పర్యవేక్షణలో ఆయన 'ఖమ్మం జిల్లాలో కోయ తెగ – ఆర్థిక పరిస్థితులు' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు.

కాలం చెల్లిన జ్యూస్ అమ్మకం



వివరాలు నమోదు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మయూరి సెంటర్‌లోని జీపీ రెడ్డి స్వీట్‌షాప్‌లో బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. కాలం చెల్లిన మిక్స్‌డ్ ఆపిల్ జ్యూస్ ప్యాకెట్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గడువు తీరిన ఆపిల్ జ్యూస్ బాటిళ్లను గుర్తించి శాంపిల్స్ సేకరించడంతో పాటు షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రూ.1.49కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంలోని రిక్కాబజార్‌కు చెందిన షేర్ బ్రోకర్ మహ్మద్ అబ్దుల్ మూయిద్ పది మందిని ప్రతివాదులుగా చేరుస్తూ రూ.1,49,20,000కు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. ఆయన మూడేళ్ల క్రితం నగరంలో వ్యాపారాన్ని ప్రారంభించి షేర్లు కొనడం, అమ్మడం చేసేవాడు. ఈక్రమంలో షేర్ల విలువ పడిపోవడంతో పెట్టుబడి పెట్టిన వారి నుంచి ఒత్తిడి వస్తోందని చెబుతూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది ద్వారా బుధవారం దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

'దళితబంధు' మొబైల్ క్యాంటీన్ సీజ్



మొబైల్ క్యాంటీన్‌ను సీజ్ చేస్తున్న ఉద్యోగులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి సునీతకు దళితబంధు పథకం ద్వారా మంజూరైన మొబైల్ క్యాంటీన్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శి చెవుల మహేష్ బుధవారం సీజ్ చేశారు. క్యాంటీన్‌ను ఆమె గత మూడు నెలల నుంచి నడిపించడం లేదు. లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధి కోసం మంజూరు చేసిన యూనిట్లను సక్రమంగా నడిపించాల్సి ఉన్నా అలా జరగకపోవడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేయగా యూనిట్‌ను సీజ్ చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

స్టేడియంలో ద్విచక్ర వాహనం చోరీ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. స్టేడియంకు ఆదివారం సాయంత్రం వచ్చిన నందిగామకు చెందిన విద్యార్థి వాహనాన్ని పార్క్ చేసి లోనకు వెళ్లాడు. అరగంట తర్వాత వచ్చేసరికి వాహనం కనిపించకపోవడంతో వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో స్టేడియంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కాగా, స్టేడియం పక్కనే టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ తరచుగా చోరీలు జరుగుతున్నాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం లాకుల వద్ద సాగర్ కాల్వలో గల్లంతైన ఖమ్మంకు చెందిన ఎం.మణికుమార్(32) మృతదేహం బుధవారం ఖమ్మం అర్బన్ మండలం వి.వెంకటాయపాలెం లాకుల వద్ద లభ్యమైంది. పెయింటింగ్ పనిచేసే మణికుమార్ స్నేహితుడితో కలిసి కాల్వలో ఈత కొడుతుండగా నీటి ఉధృతితో మంగళవారం గల్లంతయ్యాడు. రాత్రి పొద్దుపోయే వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం గాలించగా వి.వెంకటాయపాలెం వద్ద మృతదేహం లభించింది. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

పవిత్ర మాసం.. రంజాన్

- ముస్లింల ఉపవాసదీక్షలు పవిత్రమైనవని...
- ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ముస్లింలు నిష్ఠగా ఉపవాస దీక్షలు చేసే రంజాన్ మాసం పవిత్రమైనదని.. ఈ నెల పాటు ముస్లింలు చేసే దీక్షలు గొప్పవని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఏ మతం వారైనా ప్రజలందరూ సుఖ సంతోషాలతో దేవుడిని ప్రార్థిస్తారని తెలిపారు. ఈక్రమంలో అందరినీ అల్లా చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇఫ్తార్ అనంతరం ముస్లింలకు పొంగులేటి తోఫా అందజేశారు. ఇల్లెందు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, విజయాబాయి, నారపోగు వెంకట్, చావా శివరామకృష్ణ, కార్పొరేటర్ దొడ్డా నగేష్, ఇమాం, మియాబాయ్, ముస్తఫా, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు తదితరులు పాల్గొన్నారు.





పొంగులేటి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు (ఇన్‌సెట్) ముస్లింలతో ఉపవాస దీక్ష విరమింపజేస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

■ కాంగ్రెస్ కార్యాలయంలో...



కాంగ్రెస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందులో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు

ఖమ్మం సహకారనగర్: అన్ని మతాల సమానత్వమే కాంగ్రెస్ ప్రధాన అజెండా అని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేయగా ప్రత్యేక ప్రార్థనలు అనంతరం వారు మాట్లాడారు. పార్టీ జిల్లా, నగర నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, లకావత్ సైదులు నాయక్, తోటకూర రవిశంకర్, మిక్కిలినేని నరేందర్, పెంద్ర అంజయ్య, పాలకుర్తి నాగేశ్వరావు పాల్గొన్నారు.

■ మత సామరస్యానికి ప్రతీక

ఖమ్మంక్రైం: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. పోలీస్ కల్యాణ మండపంలో పోలీస్ సిబ్బంది ఆధ్వర్యాన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్షలు ఎంతో గొప్పవని తెలిపారు. అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఏసీపీలు రామోజీ రమేష్, ప్రసన్న కుమార్, ఏఓ అక్తరున్నీసాబేగం, సీఐలు చిట్టిబాబు, శ్రీనివాస్, రవి, శ్రీనివాస్, సాంబశివరావు పాల్గొన్నారు.



ఉపవాస దీక్ష విరమింపచేస్తున్న సీపీ విష్ణు ఎస్.వారియర్

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- రాబోయే ఎన్నికల్లో సీపీఎంతో కలిసి పోటీ చేస్తాం
- సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు భాగం హేమంతరావు

నేలకొండపల్లి/కూసుమంచి/ముదిగొండ/తిరుమలాయపాలెం: రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు భాగం హేమంతరావు వెల్లడించారు. పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాపోరు యాత్రలో బుధవారం నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ, తిరుమలాపాలెం మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన సభల్లో హేమంతరావు మాట్లాడుతూ బీజేపీ మూడో సారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు ప్రజలను చైతన్యం చేసేందుకు పోరు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. మరోమారు బీజేపీ ప్రభుత్వం వస్తే బతకలేమని విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలను లొంగదీసుకునేందుకు దర్యాప్తు సంస్థలు, గవర్నర్‌ను అడ్డుపెట్టుకుని కుట్ర పన్నారని ఆరోపించారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందన్న వారికి తగిన సమాధానం చెబుతామని, గతంలో తాము, సీపీఎం విడిగా ఉండటంతో తమను ఇతర పార్టీలు ఉపయోగించుకున్నాయని ఈసారి అలాకాకుండా కలిసి పనిచేసి అధికారంలో కీలకంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో మతతత్వ పార్టీని బలోపేతం చేయాలని యత్నిస్తున్న వారిని నిలువరిస్తామని హేమంతరావు తెలిపారు. కాగా, యాత్రకు పలుచోట్ల బీఆర్ఎస్, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. ఈయాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, లతాదేవి, గోవిందరావు, కర్నాటి భానుప్రసాద్, చావా వంశీ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కాశిబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, గుండెపొంగు మల్లేష్, భూక్యా నర్సింహా, ఎడవెల్లి రమణారెడ్డి, బండి రమేష్, భట్టు పురుషోత్తం, లలితాదేవి, గంగదారి బాబు, ఎస్.కే.మౌలానా, బాలరాజు పాల్గొన్నారు.



కూసుమంచి : మాట్లాడుతున్న సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు హేమంతరావు

చీమలపాడు మృతుల కుటుంబాలకు ఎంపీ ఆర్థిక సాయం

కారేపల్లి: మండలంలోని చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సిలిండర్ పేలగా మృతి చెందిన నలుగురి కుటుంబాలకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రకటించిన రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. ఈమేరకు చీమలపాడు, స్టేషన్ చీమలపాడు, గేటురేలకాయలపల్లిల్లో మృతుల కుటుంబాలకు వైరా ఎమ్మెల్యే రాములునాయక్, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి కనకమేడల సత్యనారాయణ ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. ఎంపీపీ మాలోతు శకుంతల, నాయకులు పెద్దబోయిన ఉమాశంకర్, బాణాల వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ, రావూరి శ్రీనివాసరావు, మాలోతు కిషోర్, బానోతు సక్రాం, బానోతు కుమార్, ధరంసోత్ శంకర్, మోరంపూడి ప్రసాద్, అడపా పుల్లారావు, అడ్డగోడ ఐలయ్య, అజ్మీరా వీరన్న, డేగల ఉపేందర్, ఈదర కోటేశ్వరరావు, తోటకూరి రాంబాబు, పిల్లి వెంకటేశ్వర్లు, జూపల్లి రాము, బత్తుల శ్రీనివాసరావు, కల్తి అరుణ్ పాల్గొన్నారు.



వలస కూలీ సందీప్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

బీఆర్ఎస్‌తోనే రైతులకు భరోసా

ఎర్రుపాలెం: రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.. తద్వారా రైతులకు భరోసా లభిస్తోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని పెద్దగోపవరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యాసంగిలో వరి సాగు చేసిన రైతులు ఇబ్బంది పడొద్దనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత గ్రామంలోని మిర్చి కల్లాల్లో రైతులతో మాట్లాడి దిగుబడి, ధర వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, వ్యవసాయాధికారి కె.విజయ భాస్కరరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, శివాజీ, పురుషోత్తం రాజు, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి, సగ్గుర్తి కిషోర్, సంక్రాంతి కృష్ణారావు, సూరానేని రామకోటేశ్వరరావు, శీలం అక్కిరెడ్డి, కుడుముల మధుసూదన్‌రెడ్డి, శెట్టిపల్లి మదన్‌రెడ్డి, రామిశెట్టి సుజాత, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఘనంగా విజయమ్మ జన్మదిన వేడుకలు

ఖమ్మంరూరల్/ఖమ్మం మయూరిసెంటర్: వైఎస్సార్‌టీపీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్.విజయమ్మ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పాలేరు నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ టీపీ నాయకుడు సంధ్యాల రవీందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు ఎండపల్లి వెంకయ్య, వాలూరి సత్యనారాయణ, సామినేని రవి, తోట చినవెంకటరెడ్డి, బత్తిని యాలాద్రి, ఆడెపు ఆంజనేయులు, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైఎస్.విజయమ్మ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ టీపీ అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు ఆధ్వర్యాన మామిళ్లగూడెంలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఆలస్య రవి, వాలూరి, సత్యనారాయణ, సామినేని రవికుమార్, ఎండపల్లి వెంకయ్య, రాంబాబునాయక్, గౌరుసాని రామిరెడ్డి, వీరునాయక్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రవీందర్‌రెడ్డి

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో రఘునాథపాలెం మండలం దోనబండకు చెందిన మారుతీ రామారావుకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమా పూజిత తీర్పు చెప్పారు. బుధవారం వెలువడిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. దోనబండకు చెందిన యలమందల కృష్ణ వద్ద 2017 ఏప్రిల్ 15న మారుతీ రామారావు రూ.75 వేలు అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత ఆయన ఇచ్చిన చెక్కును కృష్ణ తన ఖాతాలో జమ చేయగా రామారావు ఖాతా రద్దు చేసుకున్నట్లుగా తెలిపారు. దీంతో ఆయన న్యాయవాది ఎం.హన్మంతరావు ద్వారా కోర్టులో కేసు దాఖలు చేయడంతో విచారణ అనంతరం రామారావుకు ఆరు నెలల శిక్ష విధించడంతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.లక్ష చెల్లించాలని తీర్పు చెప్పారు.

పోలీసుస్టేషన్‌లో ప్రేమజంట కుటుంబీకుల ఘర్షణ

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి తల్లి

ఖమ్మంఅర్బన్: నాలుగేళ్ల ప్రేమించుకున్న యువతీ, యువకులు పెద్దలకు చెప్పకుండా పెళ్లి చేసుకున్నారు.. ఆపై రక్షణ కల్పించాలని పోలీసుస్టేషన్‌కు రాగా.. అదే సమయానికి ఇద్దరి కుటుంబీకులు కూడా చేరుకున్నారు. దీంతో ఘర్షణ జరగగా యువతి తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పెద్ద లచ్చితండాకు చెందిన బన్సీలాల్, అదే తండాకు చెందిన ఆయన సమీప బంధువు సిరి చందన నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుతున్న వీరిద్దరు ఈనెల 17న హైదరాబాద్‌లో వివాహం చేసుకున్నారు. యువతి అదృశ్యమైన ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైయింది. కాగా, పెళ్లి చేసుకున్న యువతీయువకులు బుధవారం పోలీసుస్టేషన్ రాగా, అదేసమయానికి ఇరువురి కుటుంబసభ్యులు సైతం వచ్చారు. ఈక్రమంలో అమ్మాయి తల్లి కుమార్తెను తనతో రావాలని సూచించగా ఆమె భర్తతోనే వెళ్తానని చెప్పింది. దీంతో రెండు కుటుంబాల వారు స్టేషన్ ఆవరణలోనే ఘర్షణ పడ్డారు. చివరకు పోలీసులు కలగచేసుకుని యువతీ, యువకులిద్దరూ మేజర్లే అయినందున వారి ఇష్టప్రకారం నడుచుకోవాలని బయటకు పంపించగా.. అమ్మాయి తల్లి పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించుతున్నారు. ఈ విషయమై ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి మాట్లాడుతూ ప్రేమ జంటకు కౌన్సెలింగ్ చేయగా, కలిసే ఉంటామని చెప్పడంతో పిపంచామని తెలిపారు. ఆతర్వాత స్టేషన్ బయట ఘర్షణ పడి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనతో తమకు సంబంధం లేదని చెప్పారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో గొడవ పడుతున్న ఇరు కుటుంబాలు

జాఫర్ బావిలో మురుగు తొలగింపు షురూ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఖిల్లాలో ఉన్న జాఫర్ బావిలో మురుగు తొలగింపు పనులను బుధవారం ప్రారంభించారు. వాడవాడకు పువ్వాడ కార్యక్రమంలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖిల్లాలో పర్యటించిన సందర్భంగా స్థానికులు గతంలో తాగునీటి అవసరాలకు ఉపయోగపడిన జాఫర్ బావి చెత్తాచెదారంతో నిండిపోయిందని తెలిపారు. దీంతో మంత్రి ఆదేశాలతో కేఎంసీ అధికారులు బావిని శుభ్రం చేయిస్తున్నారు. ఈపనులను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించగా.. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డీఈ నవ్యజ్యోతి, ఏఈ తదితరులు పాల్గొన్నారు.



మురుగు తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

వైరా: తెలంగాణలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ విమర్శించారు. వైరాలో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యాన నిరుద్యోగ మార్చ్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న భానుప్రకాశ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీతో నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాగా, వచ్చేనెల 2న ఖమ్మంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు బీజేపీ, బీజేవైఎం నాయకులు కాత్రావత్ మోహన్‌నాయక్, నెల్లూరి కోటేశ్వరరావు, శ్యాంసుందర్‌నాయక్, బీ.పీ.నాయక్, ఉపేందర్ గౌడ్, కిరణ్‌కుమార్, కార్తీక్, భద్రం, బండారు నరేష్‌బాబు, వీరూగౌడ్, చంద్రశేఖర్, భద్రయ్య, వెంకటకృష్ణ, మల్లికార్జున్, గోపాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో భానుప్రకాశ్, నాయకులు

తప్పుడు పత్రాలతో మత్స్య పారిశ్రామిక సంఘం?

కారేపల్లి: నకిలీ పత్రాలతో పట్టా భూములను ప్రభుత్వ భూములుగా చూపిస్తూ గిరిజన మత్స్య పారిశ్రామిక సంఘం సొసైటీని ఏర్పాటు చేసినట్లు మండలంలోని మేకలతండా, దుబ్బతండా గ్రామాలకు చెందిన కొందరు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గేటుకారేపల్లి రెవెన్యూ పరిధి మేకలతండా, దుబ్బతండాకు చెందిన తుమ్మలకుంట చెరువు సర్వే నంబర్ 347లో ఎనిమిది ఎకరాలే ప్రభుత్వ భూమిగా ఉండగా.. పట్టా, సాగులో భూమిని సైతం ప్రభుత్వ భూమిగా చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని సర్వే నంబర్ 245లో ఉన్న 1.07 ఎకరాల సంగెంకుంట చెరువును కూడా సైతం చూపిస్తూ నకిలీ పత్రాలతో మత్స్య పారిశ్రామిక సంఘం సొసైటీ ఏర్పాటుచేసినట్లు సమాచారం. ఈ సొసైటీ పేరిట వాహనాలు, వలలు తీసుకుని అమ్ముకున్నట్లు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాలతో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి బుధవారం విచారణ చేపట్టారు. ఆయన వెంట దేవాదాయ శాఖ అధికారి వేణుగోపాలాచార్యులు, ఆర్ఐ నర్సింహారావు, ఇరిగేషన్ ఉద్యోగి వెంకటేశ్వర్లు తదితరులు విచారణకు వచ్చారు. ఈక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం సొసైటీ సభ్యులతో పాటు ఫిర్యాదుదారుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఏడీ ఆంజనేయస్వామి మాట్లాడుతూ పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్

వైరారూరల్: ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన వైరా మండలం గన్నవరం–దాచాపురం శివారులో అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యాన్ని తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా అడ్డుకునేందుకు ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త పర్యవేక్షణలో ఈ చెక్‌పోస్ట్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ ఆధ్వర్యాన సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ తదితరులు వాహనాల తనిఖీ చేపట్టారు.



చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 15వ తేదీన నిర్వహించిన దక్షిణ భారత మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన దొంగల వినోద్ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లోని రెండు కేటగిరీల్లో ఆయన ప్రథమస్థానంలో నిలిచారు. ఇప్పటికే జాతీయస్థాయిలో రాణించే క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న వినోద్ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నైపుణ్యాన్ని చాటగా పలువురు అభినందించారు. కాగా, వినోద్‌ను బుధవారం ఖమ్మంలోని బాలగణపతి ఆలయ కమిటీ చైర్మన్ బాజిన్ని వీరయ్య, వీ.వీ.పాలెం ఎంపీటీసీ యరగర్ల హనుమంతురావు తదితరులు సన్మానించారు.



వినోద్‌ను సన్మానిస్తున్న దృశ్యం